బాబోయ్.. దొంగలు..!

అవగాహన కల్పిస్తున్న సీఐ సతీశ్

పాల్వంచ, ఫిబ్రవరి 9: దొంగల సంచారతో పాల్వంచ పట్టణ వాసులు బెంబేలెత్తుతున్నారు. నవభారత్ కంపెనీకి చెందిన అధికారుల ఇండ్లలో జనవరి 25న అర్ధరాత్రి దొంగలు భారీ చోరీ చేశారు. అది మరువక ముందే.. పాల్వంచ బస్టాండుకు, పోలీస్ స్టేషన్‌కు అతి చేరువలోగల కాంట్రాక్టర్స్ కాలనీలో శుక్రవారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఈ కాలనీలోని తాళ్లూరి జాన్ రత్నం కుటుంబం ఇటీవల ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. ఆ ఇంటి తాళం పగులగొట్టేందుకు దొంగలు ప్రయత్నించారు. కానీ, ఆ సమయంలో అక్కడ జనం తిరుగుతుండడంతో వెళ్లిపోయారు. ఇదే కాలనీలోని కృష్ణ సాంబయ్య, కన్నెగంటి సుధ, అనుమాండ్ల వెంకటరెడ్డి, చావా రమణ ఇండ్లలోనూ చోరీకి యత్నించారు. ఈ ఇండ్లలోని సీసీ కెమెరాల్లో దొంగల కదలికలు రికార్డయ్యాయి. ఈ విషయం తెలియడంతోనే పట్టణ వాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అప్రమత్తంగా ఉండాలంటూ కాంట్రాక్టర్స్ కాలనీలో సీఐ సతీష్, ఎస్సై రాఘవయ్య ఆదివారం అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

'సైకిల్‌పై కుంభమేళాకు..'

సైకిల్‌పై కుంభమేళాకు వెళ్తున్న గూడవల్లి కృష్ణకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కరకగూడెం/మణుగూరు టౌన్, ఫిబ్రవరి 9: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన రిటైర్డ్ అసిస్టెంట్ డిపో క్లర్క్(ఏడీసీ) గూడవల్లి కృష్ణ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు సైకిల్‌పై వెళ్తూ కరకగూడెం, మణుగూరులో ఆదివారం ఆగారు. కృష్ణను 'నమస్తే తెలంగాణ' పలుకరించగా భవితారలకు స్ఫూర్తి నింపేందుకు పర్యావరణ ప్రాముఖ్యతను వివరించేందుకు కుంభమేళా వరకు సైకిల్ యాత్ర చేపట్టాన్నానారు. శనివారం పాల్వంచ నుంచి సైకిల్‌పై యాత్ర ప్రారంభించి భద్రాచలం, మణుగూరు, కరకగూడెం మీదుగా వెళ్తు ఆగారు. ఈ యాత్ర తాడ్వాయి, మేడారం, కాళేశ్వరం, అదిలాబాద్ మీదుగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రలోకి ప్రవేశించి ప్రయాగ్‌రాజ్ కుంభమేళా చేరుకొనున్నట్లు ఆయన తెలిపారు.

సమ్మక్క, సారలమ్మ జాతరకు రావాలని రేగాకు ఆహ్వానం

రేగా కాంతారావును ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 9: మండలంలోని మారాయిగూడెంలో ఈ నెల 13న నిర్వహించ తలపెట్టిన మేడారం మినీ జాతరగా పిలిచే సమ్మక్క, సారలమ్మ జాతరకు రావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు ఆలయక మిటీ నిర్వాహకులు మండలంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి ఆహ్వానించారు. రేగాను కలిసిన వారిలో ఆలయకమిటీ నిర్వాహకులు అపకా వీర్రాజు, మడకం ప్రసాద్, బీఆర్ఎస్ మండల కో-కన్వీనర్ ఎండీ.జానీపాషా ఉన్నారు.

పర్సనల్ డీజీఎం రమేశ్‌కు సన్మానం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 9: బెస్ట్ సింగరేణియన్ ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన డీజీఎం పర్సనల్ రమేశ్‌ను ఆదివారం మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ బ్రాంచి నాయకత్వంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టుదల, కృషి సడలని ఆత్మ విశ్వాసం మనిషిని కోరుకున్న ఉన్నత స్థాయి శిఖరాలకు చేరుస్తుందని, అందుకు డీజీఎం పర్సనల్ సెలగల రమేశ్ అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగల నాగేశ్వరరావు, మస్తాన్, కోన వెంకటేశ్, మురళి కృష్ణ, డీశెట్టి రమేశ్, బక్క సుధాకర్, పీకే నాగరాజు పాల్గొన్నారు.

ఐటీసీ కార్మిక సంఘం అధ్యక్షుడికి సన్మానం

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 9: సారపాకలోని ఐటీసీ కార్మిక సంఘం ఎన్నికల్లో గెలుపొందిన కనకమేడల హరిప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావును భద్రాచలానికి చెందిన టీడీపీ నాయకులు, ఉద్యోగులు టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నర్సింహులు సత్కరించారు. ఆదివారం బూర్గంపహాడ్ శివారులోని పాములేరు వద్ద టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో విజయోత్సవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు టీఎన్‌టీయూసీ వెన్నంటే ఉండి 14వ వేతన ఒప్పందం మెరుగైన రీతిలో చేసి కార్మికుల పక్షాన పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గాదె రామకొటిరెడ్డి, టీఎన్‌టీయూసీ చైర్మన్ గల్లా నాగభూషయ్య, జీవన్‌రెడ్డి, కొడాలి శ్రీనివాస్, అబ్బినేని శ్రీనివాస్, తాళ్లూరి చిట్టిబాబు, రమేష్, కోటి, వెంకటేశ్వర్లు, కొడాలి చంటి, ఐటీసీ ఉద్యోగులు, టీఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు.

కాకతీయ విద్యాట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 9: కాకతీయ విద్యాట్రస్టు ద్వారా కమ్మ పేద విద్యార్థులకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఉచిత విద్య, హాస్టల్ వసతులు కల్పిస్తున్నామని, కమ్యూనిటీ కిచెన్ ద్వారా సేవలు అందిస్తున్నామని కాకతీయ విద్యా ఫౌండేషన్ నాయకులు గూడురు సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన మణుగూరు వచ్చిన సందర్భంగా కమ్మ సంఘం నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో దండా రాధాకృష్ణ, వీరపనేని చెన్నకేశవులు, ఉప్పలపాటి వెంకట రాంబాబు, పుచ్చకాయల శంకర్, తోటకూరి సతీశ్‌కుమార్, ఈరెల్లి అచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలతో చర్ల సంత కళ కళ

సంతలో నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తున్న ఆదివాసీ మహిళలు

చర్ల, ఫిబ్రవరి 9: ప్రతి ఆదివారం చర్లలో జరిగే సంత ఆదివాసీల రాకతో కళ కళలాడింది. చత్తీస్‌గఢ్ సరిహద్దున ఉన్న చర్ల మండలానికి ప్రతి యేడాది జనవరి నుంచి మిర్చితోటల్లో కూలీ పనులు చేసేందుకు వచ్చి గోదావరి తీరంలో ఉంటారు. ఆదివాసీలు ఆదివారం చర్లలో జరిగే వారపు సంతకు నిత్యావసర సరుకులకోసం వస్తారు. సంతలో ఒక్క ఆదివారమే సుమారు రూ.25 లక్షల వరకు వ్యాపారం జరుగుతుంది. వారం రోజులపాటు మిర్చి తోటల్లో పనిచేసే ఆదివాసీలకు ఆదివారం చర్లసంత ఒక ఆటవిడుపుగా ఉంటుంది.

అ'పూర్వ'ం.. ఆత్మీయం..!

40 ఏళ్లకు కలుసుకున్న పదోతరగతి సహాధ్యాయులు

40 ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 9: వీళ్లంతా బాల్య మిత్రులు. ఖమ్మం గాంధీచౌక్‌లోని 'స్వామి వివేకానంద ట్యుటోరియల్ కాలేజీ'లో 40 ఏళ్ల క్రితం పదోతరగతి (1983-84 బ్యాచ్) విద్యార్థులు. 1984లో పదోతరగతి పూర్తయ్యాక తలోదారిన వెళ్లారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. 'మనవాళ్లు ఎవరెవరు ఎక్కడెక్కడ ఎలా ఉన్నారో..' తెలుసుకోవాలని అనుకున్నారు- వెగ్గళం శ్రీనివాస్, చెరుకూరు మురళి, కోసు రమేష్ గౌడ్, బండి రమేష్, అందే శ్రీనివాసరావు, కాసాల శ్రీనివాస్, హనుమంతరావు. ఎక్కడెక్కడో స్థిరపడిన తమ సహాధ్యాయులైన మిత్రులందరినీ కలిపేందుకు, నాటి ఆత్మీయానుబంధాన్ని తిరిగి చిగురింపజేసేందుకు అన్వేషణలోకి దిగారు. దాదాపుగా అందరి వివరాలను సేకరించారు. పరస్పర (తాజా) పరిచయాల కోసం వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఖమ్మంలోని ఓ హోటల్ వేదికగా 35 మంది మిత్రులు ఆదివారం కలుసుకున్నారు. వీరి ఆహ్వానాన్ని మన్నించి. దీవించేందుకు నాటి గురువులు కూడా వచ్చారు. 40 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఈ మిత్రులంతా అనిర్వచనీయ అనుభూతికి లోనయ్యారు. ఆత్మీయ పలకరింపులతో మొదలైన సందడి.. సాయంత్రం వరకు సాగింది. నాటి చిలిపి పనులు, అల్లరి చేష్టలు, గిల్లి కజ్జాలు, గురువుల బెత్తం దెబ్బలు.. ఇలా అన్నీ గుర్తు చేసుకున్నారు. సరదా..సరదాగా.. అచ్చం 40 ఏళ్ల క్రితం నాటి బడి పిల్లల్లాగా మారిపోయారు. తమ కుటుంబాల యోగక్షేమాలను పంచుకున్నారు. తమ గురువులను సన్మానించి, ఆశీర్వచనాలు అందుకున్నారు. మళ్లీ మళ్లీ కలుసుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తూ, మళ్లీ కలిసేది ఎన్నాళ్లకోనన్న బెంగతో, వీడలేక-ఉండలేక.. భారమైన హృదయాలతో వీడ్కోలు చెప్పుకున్నారు.

కొత్తగూడెంలో 1979-80 బ్యాచ్ విద్యార్థులు..

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని 35వ వార్డులోగల కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి 1979-80 బ్యాచ్ విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం పట్టణంలోని హోటల్‌లో ఆదివారం జరిగింది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. శ్రీరామచంద్ర ఉన్నత పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం బ్రహ్మానంద రావును, రవి బాలనికేతన్ హెచ్ఎం వెంకటేశ్వరరావును సన్మానించారు.

పాల్వంచలో 1984-85 బ్యాచ్ విద్యార్థులు..

పాల్వంచలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పాల్వంచ, ఫిబ్రవరి 9: పాల్వంచ బొల్లోరుగూడెం ఉన్నత పాఠశాల పదోతరగతి 1984-85 బ్యాచ్ విద్యార్థులు ఇన్నేళ్ల తర్వాత బాపూజీనగర్‌లోని సుంకర రామకోటేశ్వరరావు ఫాం హౌస్‌లో ఆదివారం కలుసుకున్నారు. సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. ఇటీవల మృతి చెందిన ఆనాటి తెలుగు ఉపాధ్యాయుడు బ్రహ్మచారి ఇంటికి వెళ్లారు. తమ సారుతో ఉన్న అనుబంధాన్ని కుటుంబీకులతో పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు కనగాల బాలకృష్ణ, సుంకర రామ కోటేశ్వరరావు, కొమరెల్లి రవీందర్, బూర్గుల దాసు, మంత్రి ఓం ప్రకాష్, సుధారాణి, కిలారు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతి' రైతులు.. ఆరోగ్య రక్షకులు..!

వేరుశనగలో అంతర పంటలను పరిశీలిస్తున్న రైతులు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 9: ''పంటల సాగులో మన రైతులు రక రకాల ప్రయోగాలు చేస్తున్నారు. రసాయనిక ఎరువులకు దూరంగా ఉంటూ, సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తున్నారు. ఈ 'ప్రకృతి రైతులు' నిజంగానే ఆరోగ్య 'రక్షకులు'..! వారిని వైద్యులతో పోల్చవచ్చు'' అని, వాసన్ సంస్థ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.సతీష్‌కుమార్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవునిపల్లి మండలంలోని ముస్తాఫాపూర్ సీపీపీ రైతులు.. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శనలో భాగంగా అశ్వారావుపేట మండలానికి వచ్చారు. వాసన్ సంస్థ పర్యవేక్షణలోని మల్లాయిగూడెం జీవ ప్రాజెక్టులోగల నేచురల్ ఫార్మింగ్, జీవ వనరుల కేంద్రం, ఫాం పాండ్‌లను సందర్శించారు. ఆ రైతులతో సతీష్‌కుమార్ మాట్లాడారు. కరోనా వచ్చిన దగ్గర నుంచి నేచురల్ ఫార్మింగ్‌కు డిమాండ్ పెరిగిందన్నారు. రసాయనిక ఎరువులకు దూరంగా.. జీవామృతం, ఘన జీవామృతం, పంచగవ్య, నీమాస్త్రం, కోడి గుడ్డు, నిమ్మరసం, వావిలాకు, తూటికాడ ఆకులతో సహజసిద్ధ కషాయాలతో పంటలను కాపాడుకోవచ్చని, ఆరోగ్యాన్నిచ్చే దిగుబడిని సాధించవచ్చని చెప్పారు. ఈ కషాయాలను వరి, వేరుశనగ, మినుము, కంది, పత్తి, కూరగాయలు, పామాయిల్, దేశీ వరి నవారా, ఇంద్రాణి, బర్మా బ్లాక్, కూచీపటాలీ పంటలకు వినియోగించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చని వివరించారు. నాటు ఆవు మూత్రం, పేడ వినియోగంతో కూడిన ఎరువుతో ఐదు ఎకరాలకు పైగా పండించవచ్చని చెప్పారు. ''ఇప్పటిలాగా పూర్వ కాలంలో రసాయనిక ఎరువులు/మందులు లేవు. మన పూర్వీకుల మాదిరిగానే ఇప్పుడు కూడా మన రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తున్నారు. అందరి ఆరోగ్యాన్ని రక్షిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే- 'ప్రకృతి రైతులు.. పట్టా లేని వైద్యులు'..!'' అని చెప్పారు. మన పూర్వీకుల్లో అనేకమంది సంపూర్ణ ఆరోగ్యంతో, పూర్ణ ఆయుష్షుతో ఉండడానికి ఆనాటి ఆహార ఉత్పత్తులే కారణమని చెప్పారు. నేడు అనేకమంది 50 ఏళ్లకే అన్ని రకాల రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే కూరకాయల రుచి, ఇంటి వద్దనే పండించుకునే కూరగాయల రుచికి చాలా భేదం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏకేవీఆర్ ఆర్‌డీఎస్ ఎన్‌జీవో ప్రాజెక్ట్ మేనేజర్ దేవేంద్రరెడ్డి, బాధ్యులు పి. శ్రీనివాసరెడ్డి, బి.వీరారెడ్డి, రాజయ్య, కుమార్‌స్వామి, వాసన్ సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వరావు, శ్రీనివాస్, చక్రపాణి, జీవ రైతులు దారా ప్రసాద్, కొర్రి మల్లయ్య, జయరాజు, మొడియం రాములమ్మ, సారిన సోమరాజు పాల్గొన్నారు.

నేడు 'ప్రజావాణి'

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 9: కలెక్టరేట్‌లో ఈ నెల 10న (సోమవారం) ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని, ప్రజలు తమ రాతపూర్వక అర్జీలను ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలం, ఫిబ్రవరి 9: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటలకు గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జూలూరుపాడు, ఫిబ్రవరి 9: మండలంలోని పడమట నర్సాపురం, పాపకొల్లు సబ్ స్టేషన్ల పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా సోమవారం ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. మండల విద్యుత్ శాఖాధికారి సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

న్యాయవాదిని శిక్షించి నాకు న్యాయం చేయండి

సెల్ఫీ వీడియోలో పోలీసులను కోరిన అడ్వకేట్ బాధిత యువతి

భద్రాచలం, ఫిబ్రవరి 9: న్యాయవాదిపై చర్యలు తీసుకొని అతడిని శిక్షించి తనకు న్యాయం చేయాలంటూ బాధిత యువతి కోరింది. ఈ మేరకు ఆదివారం ఒక సెల్ఫీ వీడియోను విడుదల చేసి పోలీసులకు విజ్ఞప్తి చేసింది. తనకు, తన భర్తకు ఉన్న విభేదాల కారణంగా తనకు విడాకులు ఇప్పించాలంటూ భద్రాచలం మెడికల్ కాలనీకి చెందిన భరణి వెంకటకార్తీక్ అనే న్యాయవాదిని తాను ఆశ్రయించానని బాధిత యువతి పేర్కొంది. ఈ క్రమంలో న్యాయవాది కార్తీక్ తనకు మాయమాటలు చెప్పాడని, తనను వివాహం చేసుకుంటానంటూ నమ్మబలికాడని, తన కారణంగా ఇప్పుడు తాను రెండు నెలల గర్భిణిని కావడంతో కార్తీక్ మొహం చాటేస్తున్నాడని, ఇష్టమొచ్చింది చేసుకో అంటూ బెదిరిస్తున్నాడని వివరించింది. దీంతో తాను ఎస్సీని కలిసి కార్తీక్‌పై ఫిర్యాదు చేయగా.. ఆ ఫిర్యాదును ఆయన స్థానిక సీఐకి రిఫర్ చేశారని పేర్కొంది. భద్రాచలం పోలీసులు గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌కు పిలిపించి మాట్లాడారని అన్నది. అయితే, పెద్దల సమక్షంలో చర్చించుకుంటామని, తనను వివాహం చేసుకుంటానని పోలీసుల సమక్షంలో చెప్పాడని, కానీ బయటకు వచ్చాక మళ్లీ మొహం చాటేశాడని అన్నది. దీంతో తన ఫిర్యాదు మేరకు అదే రోజు భద్రాచలం పోలీసుస్టేషన్‌లో కార్తీక్‌పై కేసు నమోదు కాగా. విషయం తెలుసుకున్న కార్తీక్ వెంటనే పరారయ్యాడని అన్నది. ఇదే విషయంపై పట్టణ సీఐ రమేష్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. కార్తీక్ అప్‌స్టాండింగ్‌లో ఉన్నాడని, వీలైనంత త్వరగా నిందితుడిని పట్టుకుంటామని సమాధానమిచ్చారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 9: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఆళ్లపల్లి మాజీ ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి అన్నారు. ఆదివారం మండలంలోని మర్కోడు పంచాయతీ పెద్దూరు క్రీడా మైదానంలో మర్కోడు యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంపీఎల్ సీజన్-2 క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా సన్మార్గం వైపు ప్రయాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మర్కోడు పంచాయతీ మాజీ 3వ వార్డు సభ్యుడు వగలబోయిన సతీశ్, పోటీల నిర్వాహకులు తాళ్లపల్లి శేఖర్, ఏడూళ్ల నాగేశ్, తాళ్లపల్లి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గొంగడి త్రిషకు సన్మానం

సన్మానం అందుకుంటున్న త్రిష

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ స్థాయి మహిళల క్రికెట్ పోటీల్లో భారత్ జట్టుకు విజయాన్ని అందించిన భద్రాచలం ప్రాంతానికి చెందిన కెప్టెన్ గొంగడి త్రిషను కొత్తగూడెం గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ చింతలచెర్వు గెర్షోమ్ ఆదివారం సన్మానించారు. సికింద్రాబాద్‌లోని త్రిష ఇంటిలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు, కొత్తగూడెం ప్రముఖులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం, ఫిబ్రవరి 9: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణపుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధ్రువమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామి వారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

7వ రోజుకు చేరిన ముత్యాలమ్మ జాతర

అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 9: దుమ్ముగూడెంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఏడవరోజుకు చేరింది. ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ఉదయం అభిషేకాలు, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు రావడంతో బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ అశోక్ భారీ బందోబస్తు నిర్వహించారు.

కాసాని ఐలయ్యకు నివాళి

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 9: సీపీఎం నేత కాసాని ఐలయ్య సంస్మరణ సభ ఆదివారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది. కాసాని చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, నాయకుడు ఎంఎన్.రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఏజే రమేష్, పుల్లయ్య, నాగేశ్వరరావు, తొగరు రాజశేఖర్, భూక్యా రమేష్, సలిగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐలయ్య సంతాప సభ

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్ నబి

ఇల్లెందు, ఫిబ్రవరి 9: భూపోరాటంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చిన మహనీయుడు కాసాని ఐలయ్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్ నబి అన్నారు. ఆదివారం ఇల్లెందు దేవులపల్లి యాకయ్య నగర్ భూపోరాట కేంద్రంలో సీపీఎం నాయకుడు మన్యం మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నబీ మాట్లాడారు. ఐలయ్య మరణం ఉమ్మడి ఖమ్మం జిల్లా సీపీఎంకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరంలో గ్రామస్తులు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని పండువారిగూడెం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఖమ్మంలోని మార్వెల్ హాస్పిటల్ వైద్యులు నిర్వహించారు. పక్షవాతం, బీపీ, ఘగర్ తదితర వ్యాధులకు వైద్యం చేశారు. హాస్పిటల్ ఎండీ సత్యనారాయణ, వైద్యులు టి.పవన్, మొయినుద్దీన్, రాజేష్, నవ్య, మహేష్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఉరేసుకుని మైనర్ ఆత్మహత్య

భద్రాచలం, ఫిబ్రవరి 9: తల్లి మందలించిందని మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని మెడికల్ కాలనీలో ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని మెడికల్ కాలనీకి చెందిన మైనర్ సరిగా చదవకపోవడంతో తల్లి మందలించడంతో మనస్థాపానికి గురైన ఇంట్లో తల్లిదండ్రులు నిద్రిస్తుండగా తెల్లవారుజామున ఇంటి దూలానికి ఊరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

అశ్వారావుపేట, ఫిబ్రవరి 9: తాను ఏది అడిగినా కూడా తల్లిదండ్రులు ఇవ్వడం లేదన్న కోపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఫైర్ కాలనీకి చెందిన చీకటి స్వామి(20), తనకు బుల్లెట్ బైక్ కొనివ్వాలని కొన్ని రోజులుగా తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నాడు. ఫైర్ స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న తల్లి వద్దకు వెళ్లి, టిఫిన్ చేసేందుకు డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఇంటి వద్ద ఉన్నాయని, వచ్చిన తర్వాత ఇస్తానని ఆమె చెప్పింది. తాను ఏది అడిగినా తల్లిదండ్రులు ఇవ్వడం లేదన్న కోపంతో ఇంటికి వెళ్లిన ఆ యువకుడు, ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి తండ్రి కొండయ్య ఫిర్యాదుతో కేసును ఎస్సై యయాతి రాజు నమోదు చేశారు.

జామాయిల్ కర్ర తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

జూలూరుపాడు, ఫిబ్రవరి 9: ఫారెస్ట్ ప్లాంటేషన్ నుంచి జామాయిల్ కర్రలను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీ అధికారులు పట్టుకున్నారు. జూలూరుపాడు అటవీ శాఖాధికారి ప్రసాదరావు తెలిపిన వివరాలు.. ఏన్కూరు మండలం గుంగుల నాచారం గ్రామ సమీపంలోని జామాయిల్ ప్లాంటేషన్‌లో జామాయిల్ చెట్లను నరికి, కర్రలను ట్రాక్టర్‌లో తరలిస్తున్నారన్న సమాచారంతో అటవీశాఖ సిబ్బంది నిఘా వేశారు. ఆ ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. ఆ జామాయిల్ కర్రల విలువ సుమారు రూ.15వేల